క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. వైద్యులతో పాటు సిబ్బంది హాజరై అన్నిరకాల జబ్బులకు చికిత్సలు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తుమ్మలపెంటలో ..

కొలిమిగుండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుమ్మలపెంటలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ఆవరణలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు క్యాంపు ఉంటుందన్నారు. నలుగురు స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుంకేసులలో..

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోటబావిలో పూడికతీత



పూడికతీత పనులు చేస్తున్న యువకులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కోటబావిలో యువకులు మోహన్, హర్ష, శరత్‌తో పాటు పలువురు సోమవారం పూడికతీత పనులు చేపట్టారు. గ్రామానికి మధ్యలో ఉన్న పురాతన బావిలో చెత్త చెదారం పేరుకుపోయింది. యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెత్తను తీసి, బావిని శుభ్రపరిచారు. చుట్టు పక్కల నివాసాల ప్రజలు చెత్తను బావిలో వేయరాదని యువకులు సూచించారు.

సబ్సిడీ శనగ విత్తనాలకు నేటి నుంచి పేర్ల నమోదు

కోవెలకుంట్ల: సబ్సిడీ శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ నిరంజన్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్ మొదటి పంటగా సాగు చేసిన పప్పుశనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం రాయితీతో సరఫరా చేస్తోందన్నారు. సబ్సిడీ పోనూ క్వింటాకు రూ.4,860 చెల్లించాలన్నారు. ఎకరాకు రెండు ప్యాకెట్ల(40 కిలోలు) చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బేతంచెర్ల: తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని అంబాపురం ఎస్సీ కాలనీ వాసులు సూర్యనారాయణ, మహేష్,కాశీ, రామ మద్దిలేటి, మధు నాగేంద్ర, వెంకట్రాముడు, పెద్ద మద్దయ్య కోరారు. కాలనీలో 15 రోజులుగా నీరు, వీధిలైట్ల సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఇదే విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వెలసిన శైవ పుణ్యక్షేత్రం ముచ్చట్ల భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భాద్రపద సోమవారం పూజలు నిర్వహించారు. వేదపండితులు నరేష్ శర్మ, అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో భక్తులు భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. బుగ్గానిపల్లె గ్రామ సమపంలో వెలసిన బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

జిల్లాకేంద్రానికి వెళ్లి పింఛన్ అందజేత



నంద్యాలలోని ఆసుపత్రిలో ఉన్న మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేంద్ర

సంజామల: పింఛన్ పంపిణీ రెండవ రోజు సోమవారం కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన గుండా పార్వతమ్మ అనారోగ్యంతో నంద్యాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ సురేంద్ర అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

ఆలమూరు గ్రామానికి వెళ్లి..

బనగానపల్లె రూరల్: పట్టణానికి చెందిన పింఛన్‌దారుడు చాకలి సుబ్బరాయుడు గుండె జబ్బుతో బాధ పడుతూ పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ దేవలత ఆలమూరు గ్రామానికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్ అందజేశారు.



మోడల్ స్కూల్ ఆవరణం శుభ్రం చేస్తున్న విద్యార్థినులు



పాతపేట హైస్కూల్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



బేతంచెర్లలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యులు

జాతిపితకు ఘన నివాళి

● పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు



ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్



బేతంచెర్ల: ఎంపీడీఓ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఎంపీడీఓ వెంగన్న తదితరులు

డోన్/టౌన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయనకు పలువురు ఘన నివాళులర్పించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి 1990–91 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు నివాళులర్పిం, ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మల్లికార్జునరెడ్డి, శ్రీసుధ హైస్కూల్ కరస్పాండెంట్ గుప్తా, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

● **ఆవోపా ఆధ్వర్యంలో..**

ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్(ఆవోపా), ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆవోపా అధ్యక్షులు క్రిష్ణకిశోర్, మునిసిపల్ వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు జొన్నల గడ్డ శ్రీను, బచ్చు గుప్తా, ఎస్.ఎల్.మధు తదితరులు పాల్గొన్నారు.

● **రోటరీక్లబ్ ఆధ్వర్యంలో..**

మహాత్ముని చిత్రపటానికి రోటరీక్లబ్ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు నాయక్, లక్ష్మిరెడ్డి, సభ్యులు జింకల కృష్ణ, రాజా విజయ్‌కుమార్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ సైనిక ఉద్యోగులు సంఘం అధ్యక్షులు వెంకట్రాముడు ఆధ్వర్యంలో జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా కీ సేవా కార్యక్రమంలో భాగంగా డోన్ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, స్కాట్ మాస్టర్ విఘ్నేష్, గైడ్ కెప్టెన్ సువర్ణ కుమారీ పాల్గొన్నారు.

● డోన్ పాతపేట హైస్కూల్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మండల ప్రధానకార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **బేతంచెర్ల:** మండల వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఎంపీడీఓ వెంగన్న గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, సీఐ ప్రియతం రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, సర్పంచ్ ఎస్తేరమ్మ తమతమ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **ప్యాపిలి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. జాతిపిత చిత్ర పటానికి తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ పూల మాల వేసి నివాళులర్పించారు. అలాడే పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు గాంధీ సర్కిల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు శ్యాంసన్, మత్తుబాబ సాహెబ్, గాజుల నరసింహులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

గాంధీ ఆశయసాధనకు కృషి



అవుకులో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కోవెలకుంట్లలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



బనగానపల్లెలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



సంజామలలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పోచా రమాదేవి

బనగానపల్లె రూరల్: గాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవాధ్యక్షులు ఎస్ఎస్ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఆర్యవైశ్యభవనంలో సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటంతో ఆస్థానం రోడ్డు, పెట్రోల్‌బంకు, ప్రభుత్వ ఏరియా వైద్యశాల మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరామవెంకటసుబ్రమణ్యం, జంగం శెట్టి, టంగుటూరి శీనయ్య, నూకల విజయుడు, నల్లగట్ల వెంకటేశ్వర్లు, స్వర్ణలత, సుప్రజ పాల్గొన్నారు. నాయీ బ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, కోశాధికారి శివయ్య, రామమద్దిలేటి తదితరులు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీటీఎఫ్ కార్యాలయం సంఘం జిల్లా అధ్యక్షులు మాధవస్వామి ఆధ్వర్యంలో జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళుర్పించారు. అలాగే తమ్మడపల్లె సచివాలయంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.

● **కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీ ఆర్ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పకుమారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక అమ్మవారి శాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాతిపిత విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐ రామంజులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కాల్వ నాగేశ్వరరావు, నాగరాజు, శిల్పా సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, మురళీ, ఈఓ గోపీనాథ్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

● సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగకుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ పోచా రమాదేవి జాతిపిత మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పాపరాయుడు, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామిరెడ్డి, ఏపీఓ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● **అవుకు:** మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, ఎంఈఓ శ్రీధర్‌రావు..గాంధీజీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

శ్రీరామ శౌర్య జాగరణ యాత్రను జయప్రదం చేయండి



శ్రీరామ శౌర్య జాగరణ యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, బేతంచెర్లలో ఈనెల 6న కొనసాగే దేశవ్యాప్త శ్రీరామ శౌర్య జాగరణ యాత్రను జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6న ఆర్ఎస్ రంగాపురంలో ప్రారంభమై బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలల వరకు చేరుకుంటుందన్నారు. అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు హుసేన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, భజన కృష్ణయ్య, నాగ మోహన్, మురళీ కృష్ణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ చేరిన పోతురాజు ఆలయ సమస్య



సీఐ కార్యాలయం వద్ద చెరువుపల్లె గ్రామస్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని గోవిందిన్నె గ్రామ సమీపంలో ఉన్న చెరుపల్లె గ్రామానికి చెందిన పోతురాజు ఆలయ సమస్య పోలీస్ స్టేషన్ చేరింది. 300 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని గత టీడీపీ పాలనలో జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ యజమాన్యం తొలగించింది. దీంతో ఆలయాన్ని పునర్నించాలని చెరువుపల గ్రామస్తులు కోరుతూ వస్తున్నారు. రెండు రోజుల క్రితం నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పందించి యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాయాలని సీఐ తిమ్మారెడ్డికి సూచించారు. అందులో భాగంగా గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులు సోమవారం స్టేషన్‌కు వచ్చారు. ఆలయ పునర్నిర్మించేందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించారని, అయితే నిర్మించాల్సిన స్థలం విషయంలోనే భేదాభిప్రాయాలున్నాయని గ్రామస్తులు పుల్లయ్య, సూర్యనారాయణరెడ్డి తదితరులు తెలిపారు.



పాతబస్టాండ్‌లో కూరగాయల మార్కెట్ భవన నిర్మాణ పనులు



రైల్వేస్టేషన్ రోడ్డులో నిర్మిస్తున్న క్లబ్ హౌస్

వేగంగా భవన నిర్మాణాలు

డోన్: పట్టణంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులలో 80 శాతం పనులు పూర్తికాగా, మరో 20 శాతం పనులు మాత్రమే శరవేగంగా జరుగుతున్నాయి. రాబోయే రెండు నెలల్లో పనులన్నింటినీ పూర్తిచేసి డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. రూ.2,400 కోట్లతో విద్య, వైద్య, వ్యవసాయ, పర్యాటకం, సాగు, తాగు నీటి రంగాలలో అభివృద్ధి పనులు పూర్తికావచ్చాయి. ప్రస్తుతం రూ.16 కోట్లతో కూరగాయల మార్కెట్, రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.3 కోట్లతో క్లబ్ హౌస్, రూ.3 కోట్లతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, వైఎస్ నగర్‌లో రూ.11.20 కోట్లతో పట్టణ శాశ్వత తాగునీటి పథకం(ఈఎస్ఎల్ఆర్) నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులను మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈలు సురేష్, హితేష్ పర్యవేక్షిస్తున్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



వైఎస్ నగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఎల్ఆర్ తాగునీటి ట్యాంకు

'టీడీపీలో చేరిన వారు కార్పెంటర్లు కాదు'

బనగానపల్లె: స్థానిక టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరినవారు కార్పెంటర్లు కాదని బనగానపల్లె కార్పెంటర్ల సంఘం అధ్యక్షులు చాంద్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్పెంటర్లు యూనియన్ ద్వారా ఐడీ కార్డు కలిగి ఉంటారన్నారు. టీడీపీలో చేరిన వారికి ఎటువంటి ఐడీ కార్డులు లేవన్నారు. పట్టణంలోని కార్పెంటర్లందరూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి మహమ్మద్‌హుస్సేన్, సలహాదారు ఖాదర్‌బాషా, సభ్యులు గోల మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం పురస్కారాలకు కేవీకే శాస్త్రవేత్త



డాక్టర్ సుధాకర్

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ రైతు నేస్తం పురస్కారానికి ఎంపికైనట్లు కేవీకే ప్రధాన అధికారి ధనలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులకు రైతు నేస్తం పురస్కారాల్లో భాగంగా ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం ఆధ్వర్యంలో ఈ నెల 14న విజయవాడలో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

5 నుంచి 'మళ్లీ జగనే కావాలి - మళ్లీ జగనే రావాలి'

బనగానపల్లె: ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు మళ్లీ జగనే కావాలి – మళ్లీ జగనే రావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో 5న ఉదయం బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మధ్యాహ్నం కోవెలకుంట్లలోని శివకాశీ కళ్యాణ మండపం, 6న ఉదయం కొలిమిగుండ్లలోని సాయి సదన్ కళ్యాణ మండపం, మధ్యాహ్నం సంజామల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం, 7న ఉదయం అవుకులోని మూలమ్మగుడి ప్రాంగణంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

సోదాల పేరుతో కక్ష సాధింపు

డోన్ టౌన్: సోదాల పేరుతో కక్ష సాధింపు తగదని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారం రంగనాయకులు హితవు పలికారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై కేంద్రం ఎన్ఐఏతో సోదాలు చేయిస్తూ భయపెట్టాలని చూస్తోందన్నారు. ఇప్పటికైనా ఎన్ఐఏ వెంటనే సోదాలు ఆపాలని ఆయన కోరారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రాజేష్

రాజంపేట: పట్టణంలోని మన్నూరు తోట కల్యాణ మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనంపై నుంచి సోమవారం ఓ యువకుడు కింద పడి దుర్మరణం చెందాడు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం ఆర్.మండగిరికి చెందిన మద్దగిరి రాజేష్ (31) ఇక్కడికి వలస కూలీగా వచ్చి పనులు చేసుకునేవాడు. సోమవారం పని చేస్తుండగా భవనం పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఆరు నెలల గర్భవతి. అలాగే వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ వ్యవహారం మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరింది. కేసు నమోదు విషయంలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయని బాధిత వర్గాలు పేర్కొన్నాయి.

వృద్ధాశ్రమానికి అనాథ మహిళ



ఆశ్రమంలో చేర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో వృద్ధురాలు లక్ష్మీదేవికి నా అనే వారు ఎవరూ లేక పోవడం, నిలువ నీడలేక, తినడానికి తిండి లేక ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకునేది. స్ఫూర్తి సేవా సమితి సభ్యుల సహకారంతో గ్రామస్తులు వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్ల గ్రామంలో ఉన్న శ్రీ ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు.గ్రామస్తులు పులికేశవయ్య, నాగరాజు, సాలమ్మ తదితరులు నిర్వాహకులను సంప్రదించి సోమవారం వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించారు.



జోళదరాశి సమీపంలో ఆశాజనకంగా జొన్న



అకుమల్ల వద్ద కంది పైరు

ఖరీఫ్ కళకళ

● అనుకూలంగా మారిన వర్షాలు

● దిగుబడులపై అన్నదాత ఆశలు



కోవెలకుంట్ల సమీపంలో మిరప పైరు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలు కళకళలాడుతున్నాయి. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఖరీఫ్‌లో 21,319 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. ఆయా మండలాల్లో ఇప్పటి వరకు రైతులు 16,131 హెక్టార్లలో పత్తి, మిరప, జొన్న, కంది, వరి, ఉల్లి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, తదితర పంటలు సాగు చేశారు. ఆయా పంటల్లో విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వెచ్చించారు. మూడు రోజులపాటు కురిసిన వర్షాలు అనుకూలంగా మారటంతో ఆయా పంటల్లో దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.



రేవనూరు వద్ద కళకళలాడుతున్న మినుము పైరు